# పదహారేళ్లవయస్సు

పూడిపెద్ది శేషుశర్మ

విసురుగా తలుపు తోసుకొని కారెక్కి వెళ్లిపోయారు మా ఆయన. నాకు దడ పట్టుకొంది. ఇదేమిటి భగవంతుడా! ఈయన కేమయింది ఈవేళ. తండ్రీ కూతుళ్ల వివాదం ఒక పెద్ద ప్రళయంలా రేగింది. వారిద్దరికీ సర్ది చెపుదామన్న నాప్రయత్నం విఫలమే అయింది. అనూ పెద్దగా అరుస్తూ తనరూమ్‌లోకి పోయి గడియ పెట్టుకుంది. దాంతో రెచ్చిపోయి బయటకు పోయారు మాఆయన.

అనుపమ మా పెద్ద అమ్మాయి. పదహేడేళ్ల వయస్సు తనది. హరి అనుపమకంటె రెండేళ్లు చిన్న. అనూ హైస్కూల్లో జూనియర్. తెల్లగా, పొడుగ్గా, నాజూగ్గా ఉంటుంది. మంచి చొరవా, ఉత్సాహం, ధైర్యం ఉన్న పిల్లేమో అందరికీ అనూ అంటే ఒక ప్రత్యేక అభిమానం. అందరితో స్నేహం చేస్తుంది. చాలాఫ్రీగా, సోషియబుల్‌గా ఉంటుంది. గత ఏడాదిగా తన ప్రవర్తనలో, మాట్లాడే తీరులో ఒక రకమైన నిర్లక్ష్యం, స్వాతంత్ర్యభావాలు, తీవ్రంగా కనిపించడంతో మావారికి ''ఈ పిల్ల మన మాట వింటుందా'' అన్నభయం పట్టుకుంది. ''ఎంత ఈ దేశంలో స్థిరపడినా మనభావాలు, పద్ధతులు మార్చుకోవాలంటే కష్టం జానకి'' అని అంటారాయన. దానికి తోడూ, ఈ మధ్య రోజూ ఆ డేవిడ్ ఫోన్ చేయడం, తనతో అనూ గంటల తరబడి మాట్లాడడం, చూస్తున్నప్పుడల్లా మా ఆయన వెర్రి పీరులా గెంతులేస్తారు. అయ్యో నాన్న నా శ్రేయోభిలాషి. నా మంచికోసమే చెపుతున్నారు అన్న ఇంగిత జ్ఞానం లేకుండా పోతోందే నాకూతురుకి అని అనిపిస్తూంటుంది నాకు. వాళ్లిద్దరి మధ్యా సంధి కుదర్చలేక ఛస్తున్నాను నేను. అసలు సంగతేమిటంటే, వచ్చేనెలలో జరిగే ప్రామ్‌కి తనతో రమ్మని పిలిచాడు డేవిడ్. తను వెడతానని డిక్లేర్ చేసింది నా పుత్రికా రత్నం ఈ రోజు. అటువంటిదేమో కుదరదు అని భీష్మించుకు కూర్చున్నారు మా ఆయన. దాంతో వారిద్దరి మధ్యా వాగ్వివాదాలు పెరిగి, నువ్వెంతంటే నువ్వెంతనుకొని, మాఅమ్మాయి తనగది తలుపులు బిగించేసుకు కూర్చుంది. మా ఆయన కారు తీసుకొని పలాయన మయ్యారు. నిజం చెప్పాలంటే నాకూ బెంగగానేఉంది. ఈ దేశంలో పెరుగుతున్న మన పిల్లల తల్లిదండ్రులలో ఎవరికి బెంగ ఉండదు చెప్పండి? ఎంత ఆధునిక భావాలు కలవారమైనా, మన సంస్కృతి, మన సాంప్రదాయం, కనీసం మన మతానికి చెందిన వాణ్ణయినా మన అమ్మాయి పెళ్లి చేసుకోవాలన్న కోరిక మనకుండడం సహజం. మన పిల్లలు ఏ తప్పుదారిన పడతారో ఎవర్ని పెళ్లిచేసుకుంటారో, పెళ్లయిన తరువాత ఎన్నాళ్లు కలిసుంటారో అన్న ఆలోచనలు అందరి తల్లిదండ్రులకీ ఉన్నవే. అందుకే చిన్నప్పటినుండీ పిల్లలిద్దరికీ మన పద్ధతులు, మనసాంప్రదాయం అలవాటు కావాలనే మా ప్రయత్నాలన్నీ చేశాం మేము. కాని అది సరిపోతుందా! బయట ప్రపంచం, వాళ్ల స్కూలు, వాళ్ల స్నేహితులు, వారి ప్రభావం పిల్లలమీద ఎక్కువే ఉంటుంది. ఏమిటో, అటూ ఇటూ కాక ఇరకాటంలో, అడ్డకత్తెరలో పోకచెక్క మాదిరిగా ఈ పిల్లల బ్రతుకులు అవుతాయేమోనన్న భయం నాకు కలుగుతూనే ఉంది. కాని ఏంచేయాలో మాత్రం తోచలేదు. తరచు డేవిడ్ ఫోన్ చేస్తూ ఉండడంతో మా ఆయనలో కొద్దిగా అనుమానం రేగి, ఆ అబ్బాయి గురించి విషయాలన్నీ సేకరించారు మా ఆయన. ఆ అబ్బాయి అనూ స్కూల్లో సీనియర్‌ట. వాళ్ల అమ్మనాన్న విడిపోయారట. అ అబ్బాయి మాత్రం చాలా అందగాడు, తెలివైనవాడూట. దానికి తోడు ఫుట్‌బాల్ టీమ్‌కి క్వాటర్ బేక్ కూడానేమో, ఆ అబ్బాయి అంటే అందరికీ పిచ్చి. అతన్ని డేట్ చెయ్యాలని కలలు కనని అమ్మాయిలు లేరట ఆ స్కూల్లో. క్రిందటేడాది జెనిఫర్ అనే అమ్మాయితో చాలారోజులు తిరిగేడట. ఆ అమ్మాయి కాలేజీకి వెళ్లిపోవడంతో, క్రిస్టీనా అనే సీనియర్‌తో కొన్నాళ్లు తిరిగాడట. గత రెండు, మూడు నెలలుగా అనూ వెనకాతల పడుతున్నాడని స్కూల్లో అందరూ చెప్పుకుంటున్నారట. వాడు స్థిరత్వంలేని ఒకరోగ్, వాడితో స్నేహం చేయవద్దు, వాడితో మాట్లాడవద్దు అని నిర్బంధం పెట్టారు అనూని మొదట్లో. ''అతను ఒట్టిఫ్రెండే, నాకూ, అతనికి ఏమీ సంబంధం లేదు'' అని స్పష్టంగా చెప్పింది అనూ. కాని ఎప్పుడైతే ప్రామ్‌కి ఆహ్వానించాడో అప్పుడే, ఇదేదో చాలా లోతుకు పోయేటట్టుందే, దీన్ని ఇప్పుడే తుంపెయ్యాలన్న నిర్ణయాని కొచ్చేశారు ఆయన. ఫలితం ఈ గాలిదుమారం.

ఉన్నట్టుండి ఇల్లంతా నిశ్శబ్దంగా అయిపోయింది. కాని నామనస్సులోని అలజడి మాత్రం పోలేదు. ఈ పదహేడేళ్ల పిల్లకి ఎలా నచ్చచెప్పేది?

''ఈ దేశంలో మమ్మల్ని పెంచుతూ ఇండియాలో మీరు పెరిగినట్లుగా మమ్మల్ని పెరగమంటే అదెలా సాధ్యం?'' అని మా అమ్మాయి అంటే ఎలా సమాధానం చెప్పాలి తనకు?

''ఈనాటి యువతరం ఎదుర్కొంటున్న సమస్యలు నీకు సరిగ్గా అర్థం కావటంలేదు, నే చెప్పిన మాటలు వినవూ'' అంటే వింటుదా?

''15–16 సంతవత్సరాలకే కన్నెతనం పోగొట్టుకున్నఅమ్మాయిలు విరివిగా ఉన్న ఈ దేశంలో వాళ్లప్రభావం వల్ల నువ్వుకూడా ఆ త్రోవే పట్టి, కష్టాలు పడతావేమోనని నాబాధ తల్లీ'' అని ఎలా చెప్పేది?

ఈదేశంలో గత పదిహేనేళ్లుగా గయనాకాలజీ ప్రాక్టీసులో ఉన్నారేమో, ఆ బాధలన్నీ మా ఆయనకు తెలుసు. కాని మా అమ్మాయిని కూర్చోబెట్టి, తనకి అర్థం అయ్యేటట్టుగా చెప్పే ఓపిక నేర్పు తక్కువ మా ఆయనకి. ఎప్పుడు చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియటం లేదు నాకు. కాని అనూకి ఇప్పుడు పదహేడేళ్లు. ఇంకో సంవత్సరం, మా అండలో మానీడలో పెరుగుతుంది. తను స్వంతంత్ర్యంగా బతుకుతున్నప్పుడు, ఇక్కడి యువతరం ఎదుర్కొనే సమస్యలకు బలికాకుండా, తనను తనుగా కాపాడుకొనే మన

స్థైర్యం, మనో నిబ్బరం, ముఖ్యంగా ఆత్మవిశ్వాసం ఆ పిల్లలో కలిగేట్టుగా చేసే బాధ్యత నామీద ఉంది. నాకు పెళ్లయినప్పుడు భార్యాభర్తల భౌతిక సంబంధంగురించి గాని , ఫేమిలీప్లానింగ్ గురించి గాని నాకెవ్వరూ చెప్పలేదు. దాని ఫలితం, అనుకోకుండా గర్భవతినవ్వడం, పిల్లాడు పుట్టిపోవడం జరిగాయి. నాకే గనక మా అమ్మచెప్పి ఉంటే నేను అప్పుడు పడ్డ బాధలన్నీ తప్పించుకునే దాన్ని కదా!

ఈ నాడు ఈ పిల్లలు పడే బాధలు వేరు. ఆయినా ఇక్కడి పిల్లలకి 17–18 ఏళ్లకే వాళ్లకి అన్నీ తెలుసును. ఎటువంటి క్లిష్టపరిస్థితి వచ్చినా వాళ్లు తెలివిగా ఎదుర్కోగలరు అని అనుకుంటే అది మూర్ఖత్వమే అవుతుంది. మగవాడు జీవితంలో ప్రవేశిస్తే, ఎటువంటి పరిస్థితుల నెదుర్కోవలసి వస్తుందో ఈ పిల్లకి నేను చెప్పాలి. చెప్పకపోతే ఆ పిల్లకేదైనా అవుతే, తప్పునాది. కాని ఏలా చెప్పాలి? అని సోఫాలో కూర్చొని ఆలోచిస్తున్నా! అప్పుడు గుర్తొచ్చింది నాకు, ఐదేళ్లక్రింద మా మధు రాసిన ఉత్తరం. మధు నా తమ్ముడు. నాకంటె ఎనిమిదేళ్లు చిన్న. వాడికి పెళ్లయి నాలుగేళ్లయింది. రెండేళ్ల కొడుకు. రెణ్ణెల్ల పాప. ఎందుకో ఆ ఉత్తరం చాలా జాగ్రత్తగా దాచి ఉంచాను. దాని అవసరం ఎప్పుడూ వస్తుందని అనుకోలేదు. గబగబా బెడ్‌రూమ్‌లోకి పోయి ఆ ఉత్తరం తీసి చదవడం మొదలెట్టా. బెంగుళూరులో పెరిగేడేమో, తెలుగు వ్రాయడం రాదు మధుకి. ఇంగ్లీషులో రాశాడా ఉత్తరం.

"డియర్ జానకక్కా,

నీకు ఉత్తరం వ్రాయాలని గత వారం రోజులుగా ప్రయత్నం చేస్తున్నాను. ఈ రోజుకి కుదిరింది. నాకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని నీకు తెలిసిందే. బెంగుళూరులో జనరల్ మెడిసిన్ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగానే, అమెరికా వెళ్లి అక్కడ మాస్టర్స్ ఇన్ పబ్లిక్ హెల్త్ చేసి, ఎపిడిమియాలజిస్ట్ అవ్వాలని నాకు ఎప్పటినుండో ఉంది. నాకుగా నేను అమెరికా వెళ్లే మార్గాలు లేవని నీకు తెలిసిందే. నాఫ్రెండ్స్ ఇద్దరు అమెరికాలో పెరిగిన అమ్మాయిల్ని చేసుకొని అక్కడే సెటిలయిపోయారు. కాని నాకెందుకో అది అంతగా రుచించలేదు. కాని అక్కడ సి.డి.సి.లో ట్రైనింగ్ సంపాదించాలన్న బలమైన కోరిక వల్ల నేను, మా స్నేహితులు తీసుకున్న దారినే నడవాల్సి వచ్చింది. కారణంగా జ్యోతితో పరిచయం అయింది. సరిగ్గా ఏడాది క్రిందట జ్యోతిని వాళ్ల మేనమామ గారింట్లో కలిశాను. నాకు అమెరికాలో పెరిగిన అమ్మాయిని వివాహమాడాలనే ఉద్దేశ్యం ఉందని తెలిసి, వాళ్లు ఆ అమ్మాయిని బెంగుళూరుకి రప్పించి నాకు పరిచయం చేశారు. అమెరికాలో పెరిగిన అమ్మాయి ఏకాంతంగా నాతో మాట్లాడి, నా అభిరుచులు, అభిప్రాయాలు తెలుసుకోందే పెళ్లికి ఒప్పుకోదని నాకు తెలుసు. అందుకే ఆ అమ్మాయిని బృందావన్ గార్డెన్స్‌కి, అక్కడనుండి సినిమాకి, రెస్టరెంట్‌కి తీసుకుపోయి, తిరిగ వాళ్ల మామయ్యగారి ఇంటి దగ్గర దింపేస్తానని వాళ్లకు చెప్పి ఒప్పించాను. వాళ్లందరికి నేను చిన్నతనం నుండి బాగా తెలుసు. అందుచేత వాళ్లేమీ అభ్యంతరం పెట్టలేదు. జ్యోతి ఇండియాలో పుట్టినా, పెరగడం, చదువు, అంతా షికాగోలోనే. ఒక్కగానొక్క కూతురవడంవల్ల చాలా ముద్దుగా పెరిగిందట. అవిషయం నాకంతగా నచ్చకపోయినా, సరే మాట్లాడదాంలే అని నిశ్చయించుకున్నా.

జ్యోతి చూడగానే ఆకర్షించుకునే చక్కటి రూపురేఖలున్నది. అమెలో ఏదో కళ, చురుకుతనం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఆమెతో గడిపిన మొదటి పదిహేను నిముషాల్లోనే, ఆమె ముక్కుకి సూటిగా పోయే మనిషని గ్రహించాను. ఎంతోమంది అమ్మాయిలతో స్నేహంగా ఉండే నేను, ఆమెను చూసిన కొద్ది క్షణాలోనే ఏదో ఆకర్షణకు లోనయ్యాననిపించింది. కాని, అంత త్వరగా ఏ నిర్ణయం తీసుకోగూడదని నాకు తెలుసు. బృందావన్ గార్డెన్స్‌లో కాఫీ తాగుతూ, సడెన్‌గా నన్నో ప్రశ్న వేసింది జ్యోతి.

"మధూ, కేవలం అమెరికా వద్దామనేనా, మీరు నన్నుపెళ్లి చేసుకుందా మనుకుంటున్నారు" అని. సూటిగా అడిగిన ఆమె ప్రశ్నకి నేను ఆశ్చర్యపడినా ఒకరకంగా ఆమెను అభినందించకుండా ఉండలేకపోయాను.

"నిజం చెప్పమంటారా జ్యోతీ! అమెరికాలో పెరిగిన అమ్మాయిని పెళ్లిచేసుకుందా మనకోవడం, కేవలం అమెరికా వద్దామనే ఉద్దేశ్యంతో! కాని నాకు మీరు నచ్చితేనేగాని మిమ్మల్ని చేసుకుందా మనుకోవటంలేదు. బైదివే, నేను కూడా మీకు నచ్చాలిగా" అంటూ అమెరికా వస్తే, నాప్లాన్ ఏమిటో చెప్పా.

"మీరు ఈ దేశంలో పెరిగారు. మీరు డేట్ చేసి ఉండరు. కాని నేను అమెరికాలో పెరిగాను. నేను డేట్ చేస్తే, మీకు అభ్యంతరమా?" అని అడిగింది చురుగ్గా.

"నేనింతవరకూ ఏ అమ్మాయిని నా భార్యగా ఊహించుకోలేదు. కాని కేవలం మీరు డేట్ చేసినంత మాత్రాన మిమ్మల్ని అనర్హురాలిగా త్రోసి పుచ్చే కుంచిత స్వభావుణ్ణి కాను" అన్నా నవ్వుతూ. 'మీరు ఎవరినైనా డేట్ చేశారా' అని అడుగుదామని, అనిపించి, అనవసరమని ఊరుకున్నా.

తరువాత ఆ రోజంతా చాలా ఆనందంగా గడిపేశాం. ఆమె అక్కడ ఉన్న రెండువారాలు చాలా హాయిగా గడిచిపోయింది నాకు. ఒక ఆరునెలలు స్నేహితులుగానే ఉండిపోయి, దాని తరువాత పెళ్లివిషయంలో ఒక నిర్ణయాని కొద్దామని ఒప్పందాని కొచ్చాము.

ఇలా అయిన రెండునెలలకు నాకు ఢిల్లీలో ఐ.సి.ఎమ్.ఆర్ లో మంచి రిసెర్చి పోస్టు రావటం, తరువాత ఒక ప్రోజెక్టుద్వారా కెనడా, అమెరికా వెళ్లడం జరిగింది. అమెరికా వెళ్లి అట్లాంటాలో సి.డి.సి.లో ఒక నెల్లాళ్లు పనిచేశా. అప్పుడు నేనొక నిశ్చయానికొచ్చా. అమెరికాలో ఎమ్. పి. హెచ్. ఎంతత్వరగా వీలయితే అంత త్వరగా పూర్తిచేసి, తిరిగి ఇండియా వచ్చి ఇక్కడే సెటిలవుదామని. ఎలాగయితేనేం, ఆరునెలలో పబ్లిక్ హెల్త్‌లో మాస్టర్స్ సంపాదించా. ఆ ఆరునెలలో జ్యోతితో చాలాసార్లు ఫోన్‌లో మాట్లాడడం, తర్వాత ఆ అమ్మాయి రిక్వెస్ట్‌మీద షికాగో వెళ్లడం జరిగింది. నాతో ఇండియా వచ్చి సెటిలయ్యే ఉద్దేశ్యం ఉంటే తనతో వివాహం నాకు ఇష్టమేనని చెప్దామని నిశ్చయించుకున్నా. షికాగో వెళ్లి, నాఫ్రెండ్ ఇంట్లో ఉండి జ్యోతికి కబురు చేశా. తనువచ్చింది. బకింగ్‌హామ్ ఫౌంటెన్ వద్దకుపోయి చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాం. సమయంచూసి నామనస్సులోని విషయం బయట పెట్టా.

"మధూ మీతో వచ్చి ఇండియాలో సెటిలవ్వటానికి నాకేమీ అభ్యంతరం లేదు. నిజానికి మీ భార్య నవడానికి నేనెంతో అదృష్ట వంతురాలినయి ఉండాలి. కాని మనం ఆనిర్ణయం తీసుకొనే ముందు నేను మీకొక ముఖ్యవిషయం చెప్పాలి. నేను ఈ దేశంలో చాలా ఫ్రీగా తిరిగాను. మా అమ్మానాన్న ఏది కావాలంటే అది కొనిపెట్టి, నాకు ఏ కొరతా లేకుండా పెంచారు. తల్లిదండ్రులుగా వాళ్లు నాకు ఏ నిబంధనలూ పెట్టలేదు. కాని పదహారేళ్ల ప్రాయంలో, తెలిసీ తెలియని జ్ఞానంతో నేను బయట ప్రపంచంలో కడుగుపెట్టి, ఎటువంటి కష్టాలకి గురవుతానో వాళ్లు ఊహించి ఉండరు. కారణం నాకు మైక్‌తో సంబంధం. ఆ సంబంధం నాకు కేవలం మానసికంగానే కాదు, శారీరకంగాను కూడా ఏర్పడింది, ఆ వయస్సులో ఆ సంబంధం

స్వర్గంగా తోచింది నాకు. మైక్‌లేని జీవితం వృథా అనుకున్నాను. కేవలం అతని దగ్గర ఉండాలనే నేనుకూడా అతను వెళ్లిన కాలేజీకే వెళ్లా ఒక సంవత్సరం తర్వాత. అమ్మా నాన్న గార్లకు ఇదంతా తెలుసు నాసంతోషమే వాళ్లసంతోషం. నా మనసు కష్టపెట్టడం ఇష్టంలేక వాళ్లు ఏమీ అనలేదు. నేను బర్కిలీకి వెళ్లిన రోజు మైక్ వస్తాడని తహతహలాడా. కాని మైక్‌కి బదులు, తన రూమ్‌మేట్ డేవిడ్ వచ్చాడు. మైక్ బిజీగా ఉన్నాడని, అందుకే తనువచ్చాడని చెప్పాడు. నాతో ఎంతో స్నేహంగా, మర్యాదగా మాట్లాడాడు. ఇద్దరం బయటికెళ్లి భోజనం చేశాం. తరువాత తిరిగి మారూమ్‌కొచ్చి, చాలాసేపు మాట్లాడాడు. చాలాఫ్రెండ్లీగా ఉన్నాడని పించింది. కాని ...హఠాత్తుగా మాట్లాడుతున్నవాడల్లాలేచి నన్ను దగ్గరగా పట్టుకున్నాడు....." చెప్తున్నదల్లా ఆపి దృష్టి ఎటో మళ్లించింది ఒక్క క్షణం జ్యోతి..

"....తరువాత నేనెంత ప్రయత్నించినా వీల్లేకపోయింది. ఫలితం ...నేచెప్పనక్కరలేదు. తరువాత మైక్‌తో చెప్పా ఏం జరిగిందో. తనకు చీమకుట్టినట్టయినా అనిపించలేదు. తిరిగి ఇలా అవుతుందని నీకు తెలీదా అని ప్రశ్నించాడు. తరువాత తెలిసింది మైక్‌కి ఓ గర్ల్‌ఫ్రెండ్ ఉందని, నాతో ఇక అతనికి పనిలేదని, గోరుచుట్టుమీద రోకటి పోటులా అయింది నా పరిస్థితి. అప్పుడు నావయస్సు 18 సంవత్సరాలు. ఆ సంఘటన తర్వాత నాజీవితంలో ఏ మగపురుగునీ ప్రవేశించనీయలేదు. కాని ఆ దెబ్బనుండి తట్టుకోడానికి చాలా సంవత్సరాలు పట్టింది. తిరిగి చికాగో వచ్చేసి, ఇక్కడే కాలేజీ పూర్తిచేశా. నేనే కనక నా జాగ్రత్తలో మొదటినుండి ఉంటే ఈ కష్టాలేవీ ఉండేవి కాదుకదా! మైక్‌తో నేను పెట్టుకున్న సంబంధం వల్ల నాకు కలిగిన లాభం ఏమిటి? జస్ట్‌హార్టేక్!" ఆపింది, దుఃఖాన్ని మింగుకుంటూ జ్యోతి.

" మధూ దీసీజ్ మై స్టోరీ! ఐ హేడ్ టు బి ఆనెస్ట్ విత్‌యూ! ఐ ఓన్లీ విష్ ఐ కుడ్ స్టార్ట్ మై లైఫ్ ఆలోవర్ ఎగైన్. వెల్, యూ కెన్ మేక్ యువరోన్ డెసిషన్." అంటూ మౌనంగా కారెక్కి స్టార్ట్ చేసింది కారుని జ్యోతి వెనకాలే వెళ్లి నేను ప్రక్కన కూర్చున్నా. అంటాంటా వెళ్లి, ఒకవారం ఆలోచించా. ఎంత ఆలోచించినా ఆమెమీద గౌరవం తగ్గలేదునాకు. ఇంకో విషయం. నాఫ్రెండ్ భాస్కర్ చెల్లి ఎవరినో ప్రేమించి మోసపోయి గర్భవతి అయితే, ఆ అమ్మాయికి సహాయంచేసి, మంచి అబ్బాయిని చూసి పెళ్లి చేసింది నేనే. అందుకే ఏది ఏమైనా జ్యోతినే పెళ్లిచేసుకోవాలని నిశ్చయించుకున్నా. వెంటనే జ్యోతికి ఫోన్‌చేసి చెప్పా. "ఆర్ యూ ష్యూర్" అని అడిగింది సందిగ్ధతతో.

"ఇఫ్ ఐ హేడ్ ది స్లైటెస్ట్ డౌట్ ఐ వుడ్ నాట్ డూ ఇట్." అని గట్టిగా చెప్పా. అదీ సంగతి. మాపెళ్లి మార్చి పదహారుని. ఇంకా రెండు నెలలుంది. తిరుపతిలో చేసుకుందామని నిశ్చయించుకున్నాం. ఆ తరువాత ఢిల్లీలో సెటిలవుతాం.

చిన్నప్పటినుండి నువ్వంటే నాకెంతో గౌరవం. అందుకే నీతో చెప్పాలని అనిపించింది.. నీకు ఇది వ్రాయడానికి జ్యోతి అనుమతి తీసుకొనే మరీ వ్రాస్తున్నాను. నువ్వు మంచిదని నీకు తోస్తే బావగారికి చెప్పు. లేదా ఊరుకో. ఇంకెవ్వరికీ ఈ సంగతి తెలియడం నాకు ఇష్టంలేదు. ముఖ్యంగా మా అమ్మా నాన్నలకి. వాళ్లు అనవసరంగా బాధ పడతారు. నువ్వు మా పెళ్లికి వచ్చి మమ్మల్ని ఆశీర్వదిస్తావని ఆశిస్తున్నాను. బావగారిని అడిగేనని చెప్పు. అనూకి, హరికి బెస్ట్ విషెస్.

ప్రేమతో
మధు.

ఉత్తరం చదివి మళ్లీ కవరులో పెట్టా. ఆ ఉత్తరం అనూకి చూపిద్దామా వద్దా అని ఆలోచించా. నిజానికి అనూ చెపితే వినుకొనే మనిషి. ఈ ఉత్తరం చదివితే నాబాధేమిటో అర్థం అవుతుంది. మెల్లిగా మెట్లెక్కి అనూ గది తలుపు తట్టా. తలుపు తీసింది అనూ. లోపలికెళ్లి మంచంమీద కూర్చున్నా.

"చూడు అనూ, నేను, మీనాన్న ఏం చేసినా, నీ మంచిని దృష్టిలో పెట్టుకునే చేస్తాము. నువ్వింకా చిన్నదానివి. ఈ వయస్సులో అన్నీ తెలుసనుకుంటారు మీరు. నిజానికి నీకు తెలియాల్సింది చాలా ఉంది. ఈ ఉత్తరం చదువు. అప్పుడు నీకు మా బాధ అర్థమవుతుంది. చదివాక చెప్పు" అంటూ ఆ ఉత్తరం అందించా. మెల్లిగా తెరచి ఉత్తరం చదివింది అనూ. ఆమెముఖంలో ఎటువంటి మార్పు కనిపించలేదు నాకు.

"అయితే ఏమంటావ్ అమ్మా", విసుగు కనిపించింది స్పష్టంగా ఆ అమ్మాయి ముఖంలో.

"చూడు అనూ, నువ్వు ఏ నల్లవాణ్ణో, తెల్లవాణ్ణో పెళ్లి చేసుకుంటావేమో అన్న బాధ కాదు మాది. తెలిసీ తెలియని వయస్సు నీది. ఫ్రీసొసైటీ ఇది. ఇటువంటి పరిస్థితుల్లో ఏ ఒత్తిడికి లొంగిపోయి తర్వాత బాధ పడతావేమోనని మా తాపత్రయం. మన పద్ధతుల్లో మనవిలువలతో పెంచాం నిన్ను. కాని నువ్వు ఈ సంఘంలో పెరుగుతున్నావు. ఇక్కడి పిల్లలమాదిరి. నీకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అవసరం. అవి నీకు ఇవ్వకుండా నిన్ను పంజరంలో పెట్టినట్టు పెంచితే, నీకే కాదు, మాకు కూడా నష్టమే. అవకాశం దొరకగానే ఏ దూరతీరాలకో ఎగిరిపోతావు. నీ స్వేచ్ఛకు నేనూ, మీనాన్న ఏవిధంగానూ అడ్డుపడం. కాని నువ్వు ఒకటి గుర్తుంచుకోవాలి. నువ్వేపని చేసినా దానివల్ల నీకు కలిగే లాభమేమిటీ, నష్టమేమిటీ అని ఆలోచించుకొని మరీ చేయాలి. నిన్ను ప్రామ్‌కి వెళ్లొద్దు అనను. నిజానికి నువ్వు వెడితేనే మంచిది. నీ స్నేహితులతో పార్టీలకి, ట్రిప్‌లకి వెళ్లద్దు అనను. కాని నీ స్నేహితులెవరైనా విచ్చలవిడిగా హద్దుల్లేకుండా ప్రవర్తిస్తూంటే, "ఇది నాకు పనికి రాదు. ఇందులో నేను పాల్గోలేను" అని గట్టిగా చెప్పగలిగే మనోధైర్యం నీకు ఉండాలి. సిగరెట్లు, త్రాగుడు, డ్రగ్స్, ఇవన్నీ మన ఆరోగ్యానికి పనికి రావు. స్నేహితులు ఎంత ఒత్తిడి చేసినా వాటికి లొంగిపోకూడదని నువ్వు ఎప్పుడూ చెప్తూనే ఉంటావు.

మరి సెక్సో. ఇంత చిన్నవయస్సులో అది మంచిదంటావా? ఈ రోజుల్లో బోయ్‌ఫ్రెండ్స్, డేటింగ్ దేనికి దారితేస్తుందో నీకు తెలియనిది కాదు.

ఇప్పుడు డేటింగ్ తీసుకో, అది కేవలం ఇద్దరి మనుష్యులమధ్య. వాళ్లిద్దరూ భార్యా భర్తలుగా పరస్పరం ఒకరినొకరు గౌరవించుకొని జీవించగలరా అనేది నిర్ణయించు కోడానికయితే, ఇంత చిన్నవయస్సులో, పెళ్లి ఉద్దేశ్యం లేనప్పుడు డేటింగ్ ఎందుకు? అలాకాదు, డేటింగ్ కేవలం ఇద్దరి మధ్య కామ్రేడరీ కోసం అయితే, మరి సెక్సు ప్రసక్తి రాకూడదే! కాని ఏ కారణంవల్ల అయితేనేం ఈ కాలంలో డేటింగ్‌లో సెక్సు ముఖ్యాంశం అయి కూర్చుంది. అవతల మనిషితో జీవితం పంచుకునే ఉద్దేశ్యం లేనప్పుడు, సెక్సు వలన కలిగే నష్టాల గురించి ఎప్పుడైనా ఆలోచించావా! పోనీ, బర్త్ కంట్రోల్ వాడేవనుకో! కాని మనం మనుష్యులం రోబాట్స్ కాదు. ఒక వ్యక్తితో అంత ఇంటిమేట్ సంబంధం పెంచుకొని, ఏ కారణంగానైనా ఆ వ్యక్తిని వదిలి పోవాలంటే ఇమోషనల్‌గా ఎంత బాధ కలుగుతుందో ఆలోచించు. అది ఒక ఇంట్లోంచి ఇంకో ఇంట్లోకి మారేటంత సులభంకాదు. ఉదాహరణకి జ్యోతి చూడు, మైక్ తన సర్వస్వం అనుకుంది. అతను తనని వదిలి వెళ్లిపోయినపుడు ఆమె ఎంత నరకం

అనుభవించిందో! తనే కనక తన జాగ్రత్తలో ఉండి ఉంటే మైక్ వల్లగాని, డేవిడ్ వల్లగాని ఏ బాధ ఉండేది కాదు. తనకి డేవిడ్ గురించి ఏంతెలుసని చెప్పు తనని నమ్మింది. ఇంకోటి, నీకు తెలిసే ఉంటుంది. ఈ రోజుల్లో సెక్సుకి సంబంధించిన రోగాలెన్ని ఉన్నాయో! మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా, కొన్నిరోగాలు వదలించు కోవడమంటే ఎంతకష్టమో! కొన్ని అసాధ్యంకూడా! అటువంటప్పుడు క్షణికమైన శారీరక సౌఖ్యంకోసం మగాడికి లొంగిపోవడం అవివేకమే అవుతుంది. అమ్మాయిల్ని లొంగదీసుకొని కాలరెత్తుకొని "మాచో"గా ఫీలయ్యే మగవాళ్లు కోకొల్లలు. మన జీవితంలో మళ్లీ తిరిగి మొహం చూడని వాడికి శారీరకంగా లొంగిపోయి, రోగాలు, రొచ్చులు, అనవసరమైన హార్టేక్ తెచ్చుకోవడం ఎందుకు చెప్పు? చూడు, నీమీద నాకు చాలా నమ్మకం ఉంది. నేను నీకు చెప్పదలచు కొన్నదల్లా, చుట్టుప్రక్కల వాళ్ల ఒత్తిడికి తట్టుకోలేక, ఎవడికీ లొంగిపోకు. నువ్వింకా చిన్న పిల్లవి." అంటూ ఆగా.

"అమ్మా నాకదంతా తెలియదా! నిన్ను, డాడీని చిన్నప్పటినుండి చూస్తున్నాం. ఆ మాత్రం గ్రహించ లేదనుకున్నావా అమ్మా! నువ్వు చెప్పినదంతా నాకు తెలుసు. కాని నేను ఈ సొసైటీలో పెరుగుతున్నా! నా స్నేహితులతో కొన్ని నేను చేయాలి. లేకపోతే నర్డ్ అనో, వియర్డ్ అనో ఏదో పేరు పెడతారు. నా విలువలు నాకున్నాయమ్మా! సాధ్యమైనంతవరకు తప్పుదారి పట్టకుండా ఉండడానికి ప్రయత్నిస్తానమ్మా. నేను మాత్రం ఈ ప్రామ్‌కి వెళ్లాలి. నాఫ్రెండ్స్ చాలామంది వెడుతున్నారు" నిక్కచ్చిగా చెప్పింది అనూ.

"సరే మీనాన్నతో నేను మాట్లాడతాలే" మెల్లిగా బుజ్జగించా అనూని.

* * *

రెండువారాలు గడిచాయి. ఆరోజు శనివారం. మాఆయనకి, హరికి బట్టలు కొనాలని మాల్‌కి బయలుదేరాను. వెళ్తూ, అనూ వస్తుందేమోనని కనుక్కుందామని మేడమీద కెళ్లా.

"అనూ, నేను మేసీస్‌కి వెళ్తున్నా. నీప్రామ్‌కి ఏదైనా డ్రస్ కొనుక్కుందువుగాని, వస్తావా?" అన్నా.

"సరే నమ్మా" అని బయలుదేరింది అనూ.

బట్టలు కొనుక్కొని తిరిగి వస్తూంటే అంది అనూ "అమ్మా, నీకోసంగతి చెప్దామని మర్చిపోతున్నా" అని.

"ఏమిటి?" అన్నా

"నేను ఈ ప్రామ్‌కి ఒక్కర్తినీ వెడుతున్నానమ్మా. అయామ్ గోయింగ్ స్టెగ్" అంది అనూ.

"అదేం?" అన్నా ఆశ్చర్యపోతూ.

"డేవిడ్ నేనేదో తనవల్లో పడిపోతా ననుకున్నాడు. మొన్న చాలా ఇండీసెంట్‌గా ప్రవర్తించాడు. నేను తన గరల్ ఫ్రెండ్‌ని కాబట్టి తను నాతో ఎలా ప్రవర్తించినా ఫరవాలేదట. అదేం కుదరదన్నా. అంతే కాదు నేను తనతో ప్రామ్‌కి రావటంలేదు, వేరెవరినైనా చూసుకోమని చెప్పా. ఆ అబ్బాయికోసం నేనెందుకు మానుకోవాలని, నా అంతగా నేను ఒక్కర్తినే పోతున్నా" అంది అనూ. ఆ పిల్ల ముఖంలో తన మనోబలం స్పష్టంగా కనిపించింది నాకు. నేనిక ఈ పిల్ల గురించి బెంగపడాల్సింది లేదు అని తేలిగ్గా నిటూర్చా. హఠాత్తుగా నా గుండెల మీద నుండి పెద్దభారం తీసేసి నట్టయింది.

* * *


తెలుగు వారికి ప్రత్యేకంగా
తెలుగులోనే సంప్రదింపులు

**TASNEEM, M.D.,**

PEDIATRICS

Infants, Children and Adolescents

**Office Hours By Appointment**

**136-30 Sanford Avenue, Suite B**
**Flushing, NY 11355**

**(718) 358-3100**

Full Color • High Quality • Budget Based

**Arangetram**

Invitations & Programs

*Each Uniquely Designed*
*in consultations with*
*the Guru, Parents and Disciple.*




**ACCU-PRINTS, Inc.**

**(609) 627-2228**